ప్రభుత్వ ముద్రణాలయానికి కొత్త యంత్రాలు

ఖైరతాబాద్, జనవరి 11 : ఖైరతాబాద్‌లోని తెలంగాణ ప్రభుత్వ పాఠ్య పుస్తక ముద్రణాలయానికి నూతన యంత్రాలు సమకూరాయి. శనివారం ఆటోమెటిక్ నంబరింగ్, బుక్ ప్యాకింగ్, గమ్ పేస్టింగ్, హెవీ డ్యూటీ పిన్నింగ్ యాంత్రాలను డీఎస్ఈ కమిషనర్ వి. నర్సింహారెడ్డి, ముద్రణాలయం డైరెక్టర్ సీహెచ్ రమణకుమార్ ప్రారంభించారు. గతేడాది టెక్స్ట్ బుక్ ప్రెస్ అగ్ని ప్రమాదానికి గురైందని, ఉద్యోగులు, కార్మికులు, పలువురి ఆర్థిక సహకారంతో ఈ యంత్రాలను సమకూర్చినట్లు వారు పేర్కొన్నారు.

క్యాలెండర్ ఆవిష్కరణ

వెస్ట్ మారేడ్‌పల్లిలోని కార్యాలయం వద్ద రిక్గ్నైజ్డ్ స్కూల్స్ మేనేజ్‌మెంట్ అసోసియేషన్ రూపొందించిన కొత్త సంవత్సర క్యాలెండర్‌ను సనత్‌నగర్ ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్‌యాదవ్ ఆవిష్కరించారు. – బేగంపేట్

మన సంస్కృతీ సంప్రదాయాలకు ప్రతీక.. సంక్రాంతి

• బీఆర్ఎస్ రాజేంద్రనగర్ ఇన్‌చార్జి పటోళ్ల కార్తిక్‌రెడ్డి

ముగ్గుల పోటీల విజేతలకు బహుమతులందజేసిన బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు పటోళ్ల కార్తిక్‌రెడ్డి

మణికొండ, జనవరి 11: తెలుగు సంస్కృతీ సంప్రదాయాలకు సంక్రాంతి పండుగ ప్రతీక అని బీఆర్ఎస్ రాజేంద్రనగర్ నియోజకవర్గ ఇన్‌చార్జి పటోళ్ల కార్తిక్‌రెడ్డి అన్నారు. బీఆర్ఎస్ మణికొండ మహిళా అధ్యక్షురాలు రూపారెడ్డి ఆధ్వర్యంలో శనివారం సంక్రాంతి ముగ్గుల పోటీలను కేపీఆర్ కాలనీ రోడ్ నెంబర్ 7లో నిర్వహించారు. స్థానిక మహిళలు పెద్ద ఎత్తున పాల్గొని రంగు రంగుల ముగ్గులు వేశారు. న్యాయ నిర్ణేతలుగా రిటైర్డ్ ప్రొఫెసర్ సుధామాధవి వ్యవహరించారు. మొదటి బహుమతి పొందిన రమ్యకు రూ. 5 వేలు, రెండో బహుమతి పొందిన లతకు రూ.3 వేలు, మూడవ బహుమతి సాధించిన సంధ్యకు రూ. 2 వేలు, పలువురికి కన్సోలేషన్ బహుమతులను పటోళ్ల కార్తిక్‌రెడ్డి అందజేశారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ మణికొండ మున్సిపాలిటీ అధ్యక్షుడు సతారాం ధూళిపాళతో పాటు నాయకులు, కార్యకర్తలు, స్థానికులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

బంజారాహిల్స్ : జూబ్లీహిల్స్ రోడ్ నంబర్ 10లో..

సంక్రాంతి ముగ్గుల పోటీలు

బంజారాహిల్స్ : జూబ్లీహిల్స్ రోడ్ నంబర్ 10లోని గాయత్రీహిల్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో శనివారం సంక్రాంతి ముగ్గుల పోటీలు కన్నులపండువగా నిర్వహించారు. పెద్ద సంఖ్యలో మహిళలు పోటీల్లో పాల్గొని రంగురంగుల ముగ్గులు వేసి సందడి చేశారు. ఫిలింనగర్ 18 బస్తీల సంఘం అధ్యక్షుడు మామిడి నర్సింగరావు ముఖ్యఅతిథిగా విచ్చేసి విజేతలకు బహుమతులందజేశారు. ముగ్గుల పోటీలు మహిళల్లో దాగి ఉన్న సృజనాత్మకతను వెలికితీస్తాయన్నారు. కార్యక్రమంలో సంక్షేమ సంఘం సభ్యులు రాఘవులు, వెంకటేశ్ యాదవ్, శివ, రమేశ్, భరత్, రాజు, గోపాల్ తదితరులు పాల్గొన్నారు.

మాజీ సీఎం కేసీఆర్‌తోనే అభివృద్ధి సాధ్యం

• స్థానికులకు అండగా ఉంటా.. • బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు కార్తిక్‌రెడ్డి



బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు కార్తిక్‌రెడ్డితో సులేమాన్‌నగర్ నాయకులు

వ్యవసాయ యూనివర్సిటీ, జనవరి 11 : దేశంలోనే అత్యుత్తమ రాజకీయ నేత, మేధావి, మాజీ సీఎం కేసీఆర్‌ను కలవడం అదృష్టంగా భావిస్తున్నానని బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడే, రాజేంద్రనగర్ ఇన్‌చార్జి పటోళ్ల కార్తిక్‌రెడ్డి అన్నారు. కేసీఆర్ నియోజకవర్గ సమస్యలు విన్నారని, ప్రధానంగా పేదల కాలనీల్లో సమస్యలను గుర్తుచేశానని పేర్కొన్నారు. శనివారం తన నివాసానికి వచ్చిన బీఆర్ఎస్ సులేమాన్‌నగర్ డివిజన్ అధ్యక్షుడు జహీరోద్దీన్, ఇతర నాయకులనుద్దేశించి కార్తిక్‌రెడ్డి మాట్లాడారు. మాజీ సీఎం కేసీఆర్‌ను తాను ఇటీవల కలిసినట్లు తెలిపారు. ఆయన ఇచ్చిన ధైర్యంతో తాను మరింత ముందుకుసాగుతానని పేర్కొన్నారు. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజాసమస్యలను పరిష్కరించడంలో విఫలమైందన్నారు. నిరుపేద ముస్లింలు, బడుగులు అధికంగా ఉన్న రాజేంద్రనగర్ నియోజకవర్గాన్ని గత బీఆర్ఎస్ ప్రభుత్వం అభివృద్ధి చేసిందన్నారు. నియోజవర్గ ప్రజలకు అండగా ఉంటానన్నారు. అంతకుముందు జహీరోద్దీన్ కార్తిక్‌రెడ్డికి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. డివిజన్ నాయకులు అబ్దుల్ రెహమాన్, మగ్బుల్, రవి, షేక్ అమీర్, జుబేర్, దేవదాసు తదితరులు పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికి కృషి చేయాలి

కవాడిగూడ, జనవరి 11: ప్రజా సమస్యల పరిష్కారానికి కార్యకర్తలు అంకితభావంతో పనిచేయాలని కవాడిగూడ డివిజన్ బీఆర్ఎస్ పరిశీలకుడు దీన్‌దయాల్‌రెడ్డి అన్నారు. డివిజన్ అధ్యక్షుడు వల్లాల శ్యామ్ యాదవ్ ఆధ్వర్యంలో శనివారం నిర్వహించిన కార్యకర్తల సమావేశంలో దీన్‌దయాల్ రెడ్డి పాల్గొని మాట్లాడారు. బీఆర్ఎస్ పాలనలో జరిగిన అభివృద్ధిని, సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించాలన్నారు.

పీజీ కోర్సుల వన్‌టైం చాన్స్ పరీక్షా తేదీలు ఖరారు

ఉస్మానియా యూనివర్సిటీ : ఓయూ పరిధిలోని అన్ని పీజీ కోర్సుల వన్‌టైం చాన్స్ పరీక్షల తేదీలను ఖరారు చేసినట్లు కంట్రోలర్ ఆఫ్ ది ఎగ్జామినేషన్స్ ప్రొఫెసర్ శశికాంత్ తెలిపారు. ఎమ్మెస్సీ, ఎంఏ, ఎంకామ్, ఎంఎస్‌డబ్ల్యూ, బిలిబ్ఐఎస్సీ, బీసీజే, ఎంలిబ్ఐఎస్సీ, ఎంజేఅండ్ఎంసీ, ఎంకామ్ (ఐఎస్) తదితర కోర్సుల అన్ని సెమిస్టర్ల వన్‌టైం చాన్స్ బ్యాక్‌లాగ్ పరీక్షలను వచ్చే నెల 5 నుంచి నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు.

ఉచిత వైద్య శిబిరం.. మందుల పంపిణీ

మారేడ్‌పల్లి, జనవరి 11: కంటోన్మెంట్‌లోని బాలంరాయ్ కమ్యూనిటీ హాల్‌లో శనివారం ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. జనహిత సేవా ట్రస్ట్ , శివశక్తి ఫౌండేషన్, భారత్ వికాస్ పరిషత్, కిమ్స్ ఫౌండేషన్ అండ్ రీసెర్చ్ సెంటర్ సంయుక్త ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ శిబిరంలో వివిధ విభాగాలకు చెందిన కిమ్స్ ఆసుపత్రి వైద్యులు ప్రజలకు బీపీ, షుగర్ పరీక్షలు చేసి ఆరోగ్య సలహాలు, మందులను అందజేశారు.

వడ్డె ఓబన్నకు ఘన నివాళి

బంజారాహిల్స్ : గౌతమ్‌నగర్‌లో ఓబన్నకు నివాళులర్పిస్తున్న వడ్డెర నాయకులు

బంజారాహిల్స్, జనవరి 11: స్వాతంత్ర్య సమరయోధుడు, వడ్డెర కులస్తుల ఆరాధ్యుడు వడ్డెర ఓబన్న 218వ జయంతిని శనివారం ఘనంగా నిర్వహించారు. జూబ్లీహిల్స్ డివిజన్ ఫిలింనగర్‌లోని గౌతమ్‌నగర్ కమ్యూనిటీ హాల్ వద్ద ఏర్పాటు చేసిన కార్యక్రమంలో కార్పొరేటర్ వెల్దండ వెంకటేశ్‌తోపాటు వడ్డెర సంఘం నేతలు ఆర్.ఎల్లయ్య, వి.యాద య్య, కుమార్, తిరుపతి, బసవరాజు తదితరులు పాల్గొని ఓబన్న ఫ్లెక్సీకి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు.

రహ్మత్‌నగర్‌లో..

జూబ్లీహిల్స్ : వడ్డెర జాతి ఆశాజ్యోతి వడ్డె ఓబన్న అని కార్పొరేటర్ సీఎన్ రెడ్డి పేర్కొన్నారు. శనివారం వడ్డె ఓబన్న జయంతి పురస్కరించుకుని రహ్మత్‌నగర్‌లో వడ్డె ఓబన్న విగ్రహానికి ఎంబీసీ కార్పొరేషన్ చైర్మన్ జెరిపేటి జైపాల్‌తో కలిసి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అదేవిధంగా రవీంద్రభారతిలో జరిగిన వడ్డె ఓబన్న జయంతి వేడుకల్లో రహ్మత్‌నగర్ కార్పొరేటర్ సీఎన్ రెడ్డి పాల్గొన్నారు.

జూబ్లీహిల్స్ : రహ్మత్‌నగర్‌లో ఓబన్న విగ్రహం నినదిస్తున్న ఎంబీసీ కార్పొరేషన్ చైర్మన్ జైపాల్, కార్పొరేటర్ సీఎన్‌రెడ్డి తదితరులు

నీటి సరఫరాలో అసౌకర్యం కలగకుండా చర్యలు

తాగునీటి సరఫరా విషయమై అధికారులకు సూచనలు చేస్తున్న జలమండలి ఎండీ అశోక్‌రెడ్డి

జూబ్లీహిల్స్, జనవరి 11 : ప్రజలకు నీటి సరఫరాలో అసౌకర్యం కలగకుండా చర్యలు తీసుకోవాలని జలమండలి ఎండీ అశోక్‌రెడ్డి సంబంధిత అధికారులకు సూచించారు. శనివారం డివిజన్-6 పరిధిలోని పలు సెక్షన్లలో ఆకస్మికంగా తనిఖీలు నిర్వహించారు. బోరబండ, ఎర్రగడ్డ, వెంకటగిరి, ఎస్‌పీఆర్ సెక్షన్ల పరిధిలో వాటర్ ట్యాంకర్లు, ఫిల్లింగ్ స్టేషన్లను క్షేత్రస్థాయిలో పరిశీలించారు. తాగునీటి సరఫరాకు కృషి చేస్తున్నామన్నారు. కార్యక్రమంలో సీజీఎం ప్రభు, జీఎం హరిశంకర్, ఇతర అధికారులు పాల్గొన్నారు.

ప్రమాదవశాత్తు డీసీఎం దగ్ధం

• డ్రైవర్ అప్రమత్తతతో తప్పిన ముప్పు

మైలార్‌దేవ్‌పల్లి, జనవరి 11: పార్కు చేసిన డీసీఎం వాహనంలో ఒక్కసారిగా మంటలు చెలరేగి పూర్తిగా దగ్ధమైంది. డ్రైవర్ చాకచక్యంగా వ్యవహరించి గోదాములో పార్కు చేసిన డీసీఎంను రోడ్డుపై నిలిపివేయడంతో పెనుప్రమాదం తప్పింది. ఈ ఘటన మైలార్‌దేవ్‌పల్లి పోలీస్‌స్టేషన్ పరిధిలో శనివారం రాత్రి జరిగింది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. మైలార్‌దేవ్‌పల్లి డివిజన్ బుద్వేల్ రైల్వేస్టేషన్ ఇందిరాగాంధీ సోసైటీలో మహా మంగళ కార్టూన్ వేస్టేజ్ గోదాము ఉన్నది. ఇక్కడి నుంచి ప్రతి రోజూ లోడ్ చేసుకొని వాహనాలు వెళ్తుంటాయి. ఈ క్రమంలో డీఎంసీ గోదాముకు రాగా కార్మికులు వేస్టేజ్ లోడ్ చేస్తున్నారు. డ్రైవర్ డీసీఎంలో ఉన్న సమయంలోనే ఒక్కసారిగా మంటలు చెలరేగాయి. క్షణాల వ్యవధిలో మంటలు వ్యాప్తి చెందడంతో అప్రమత్తమైన డ్రైవర్ వెంటనే డీసీఎంను గోదాము నుంచి బయటకు తీసుకువెళ్లి రోడ్డుపై పార్కు చేశాడు. స్థానికులు అగ్నిమాపక సిబ్బందికి సమాచారం అందించడంతో వారు సంఘటన స్థలానికి చేరుకుని మంటలను ఆర్పే ప్రయత్నం చేశారు. అప్పటికే డీసీఎం పూర్తిగా కాలిపోయింది. ప్రమాదానికి గల కారణాలు తెలియరాలేదు.

అనుమానాస్పద స్థితిలో వ్యక్తి మృతి

బండ్లగూడ, జనవరి 11 : అనుమానాస్పద స్థితిలో ఓ వ్యక్తి మృతి చెందిన సంఘటన రాజేంద్రనగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. ఎస్సై కిశోర్ తెలిపిన వివరాల ప్రకారం.. బండ్లగూడ కాళీమందిర్ వద్ద నివాసం ఉంటున్న జయరాం(36) మతిస్థిమితం సరిగా లేక అప్పుడప్పుడూ ఇంట్లో నుంచి బయటకు వెళ్లి తిరిగి వస్తుండేవాడు. దీంతో ఇంట్లో వారు అతడి చెతిపై పచ్చబొట్టు పేరు, ఫోన్ నెంబర్‌ను రాయించారు. అతడు ఎక్కడకు పోయినా స్థానికులు అతడిని గుర్తించి సమాచారం అందిస్తే ఇంట్లో వారు తీసుకెళ్లేవారు. ఈ క్రమంలో శుక్రవారం జయరాం ఇంట్లో నుంచి వెళ్లి తిరిగి రాలేదు.శ నివారం ఉదయం ప్రెస్టేజీ విల్లా వద్ద వైర్లతో ఉరి వేసుకుని మృతిచెంది కనిపించాడు. స్థానికులు గమనించి పోలీసులకు సమాచారం అందించారు. ఘటన స్థలానికి చేరుకున్న పోలీసులు వివరాలను సేకరించి మృత దేహాన్ని పోస్ట్‌మార్టం నిమిత్తం ఉస్మానియా మార్చురీకి తరలించారు కేసు దర్యాప్తు చేపడుతున్నారు.

గంజాయి సేవిస్తున్న యువకుడు అరెస్ట్

బంజారాహిల్స్, జనవరి 11: బంజారాహిల్స్ రోడ్ నంబర్ 12లోని ఎసీబీ కార్యాలయం ఎదుట ఖాళీ స్థలంలో గంజాయి సేవిస్తున్నారన్న సమాచారం అందుకున్న పోలీసులు శుక్రవారం అర్ధరాత్రి తనిఖీలు నిర్వహించారు. అక్కడే గంజాయి సేవిస్తున్న ఎన్‌బీటీ నగర్‌కు చెందిన పి.జీవన్(24)ను పోలీసులు పట్టుకున్నారు. అతడి వద్ద నుంచి 2గ్రాముల గంజాయిని స్వాధీనం చేసుకుని పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. నిందితుడిపై ఎన్‌డీపీఎస్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

ప్రభుత్వ రంగ సంస్థలను బలోపేతం చేయాలి

హిమాయత్‌నగర్‌లోని ఎస్ఎన్‌రెడ్డి భవన్‌లో క్యాలెండర్‌ను ఆవిష్కరిస్తున్న నాయకులు

హిమాయత్‌నగర్, జనవరి 11: ప్రభుత్వ రంగ సంస్థల బలోపేతంతోనే దేశ ఆర్థిక వ్యవస్థ మెరుగుపడుతుందని ఏఐవైఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు సయ్యద్ పలి ఉల్లా ఖాద్రీ, ప్రధాన కార్యదర్శి కె.ధర్మేంద్ర అన్నారు. శనివారం హిమాయత్‌నగర్‌లోని ఎస్ఎన్ రెడ్డి భవన్‌లో ఏఐవైఎఫ్ రాష్ట్ర ముఖ్య నాయకుల సమావేశం జరిగింది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. యువజనుల సమస్యల పరిష్కారానికి నిరంతరం ఉద్యమాలు చేస్తామన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు యువతకు ఉపాధి అవకాశాలు కల్పించాలని డిమాండ్ చేశారు. రాష్ట్రంలోని నిరుద్యోగులకు ఇచ్చిన హామీలను కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేసి నిరుద్యోగ భృతి ఇవ్వాలని లేనిపక్షంలో దశలవారీగా పోరాటాలు కొన సాగిస్తామని హెచ్చరించారు. అనంతరం ఏఐవైఎఫ్ ముద్రించిన నూతన సంవత్సర క్యాలెండర్‌ను ఆవిష్కరించారు. సమావేశంలో ఏఐవైఎఫ్ రాష్ట్ర కార్యనిర్వాహక అధ్యక్షుడు ఎన్. శ్రీకాంత్, నాయకులు సత్యప్రసాద్, శ్రీమాన్, మహేందర్,సల్మాన్‌బేగ్, సుధీర్, శివకుమార్, నవీన్, జగదీశ్, హేమంత్‌కుమార్ పాల్గొన్నారు.

వాయిదాపడిన ఎంఈడీ పరీక్షా తేదీలు ఖరారు

ఉస్మానియా యూనివర్సిటీ, జనవరి 11: ఉస్మానియా యూనివర్సిటీ పరిధిలో వాయిదా పడిన ఎంఈడీ పరీక్షా తేదీని ఖరారు చేసినట్లు ఓయూ కంట్రోలర్ ఆఫ్ ది ఎగ్జామినేషన్స్ ప్రొఫెసర్ శశికాంత్ ఒక ప్రకటనలో తెలిపారు. మాజీ ప్రధాని మన్మోహన్‌సింగ్ మృతి చెందడంతో గత నెల 27న రాష్ట్రప్రభుత్వం సెలవు ప్రకటించింది. దాంతో ఆ రోజు జరగాల్సిన అన్ని పరీక్షలను అధికారులు వాయిదా వేశారు. ఈ పరీక్షను తిరిగి ఈ నెల 21న నిర్వహించనున్నట్లు ప్రకటించారు. పరీక్షా సమయం, పరీక్షా కేంద్రాల్లో ఎటువంటి మార్పు ఉండబోదని స్పష్టం చేశారు. పూర్తి వివరాలకు ఓయూ వెబ్‌సైట్ www.osmania.ac.inలో చూసుకోవచ్చని తెలిపారు.

దూరవిద్య డిగ్రీ సప్లమెంటరీ ప్రాక్టికల్ పరీక్షా తేదీలు

ఉస్మానియా యూనివర్సిటీ : ఓయూ దూరవిద్య కేంద్రమైన ప్రొఫెసర్ జి. రాంరెడ్డి సెంటర్ ఫర్ డిస్టెన్స్ ఎడ్యుకేషన్(పీజీఆర్ఆర్‌సీడీఈ) ద్వారా అందించే సప్లమెంటరీ ప్రాక్టికల్ పరీక్షా తేదీలను ఖరారు చేసినట్లు ఓయూ కంట్రోలర్ ఆఫ్ ది ఎగ్జామినేషన్స్ ప్రొఫెసర్ శశికాంత్ ఒక ప్రకటనలో తెలిపారు. బీఏ, బీకామ్, బీబీఏ, తదితర కోర్సుల అన్ని సంవత్సరాల సప్లమెంటరీ ఇంటర్నల్, ప్రాక్టికల్ పరీక్షలను ఈ నెల 18 నుంచి 28 వరకు నిర్వహించనున్నట్లు చెప్పారు. ఈ పరీక్షలను దూరవిద్య కేంద్రంలోనే నిర్వహిస్తామని పేర్కొన్నారు. వివరాలకు www.osmania.ac.inలో చూసుకోవచ్చని తెలిపారు.

వివిధ కోర్సుల పరీక్షా ఫీజు స్వీకరణ

ఉస్మానియా యూనివర్సిటీ, జనవరి 11: ఉస్మానియా యూనివర్సిటీ పరిధిలోని వివిధ కోర్సుల పరీక్షా ఫీజును స్వీకరించనున్నట్లు ఓయూ కంట్రోలర్ ఆఫ్ ది ఎగ్జామి నేషన్స్ ప్రొఫెసర్ శశికాంత్ ఒక ప్రకటనలో తెలిపారు. ఎమ్మెస్సీ (మాలిక్యులర్ అండ్ హ్యూమన్ జెనిటిక్స్) మొదటి, మూడో సెమిస్టర్ రెగ్యులర్ పరీక్షా ఫీజును ఈ నెల 16 వరకు, బ్యాచిలర్ ఆఫ్ ఇంటీరియర్ డిజైన్ మొదటి సెమిస్టర్ రెగ్యులర్ పరీక్షా ఫీజును ఈ నెల 23 వరకు సంబంధిత కళాశాల ల్లో చెల్లించాలని చెప్పారు. అయిదేళ్ల ఇంటిగ్రేటెడ్ ఎంబీఏ కోర్సు మొదటి, మూడు, అయిదు, ఏడు, తొమ్మిదో సెమిస్టర్స్ రెగ్యులర్ పరీక్షా ఫీజును ఈ నెల 24 వరకు, రూ.500 అపరాధ రుసుముతో 30 వరకు సంబంధిత కళాశాలల్లో చెల్లించవచ్చని పేర్కొన్నారు. ఈ పరీక్షలను వచ్చే నెలలోనే నిర్వహించనున్నట్లు తెలిపారు. పరీక్షా తేదీల పూర్తి వివరాలను త్వరలోనే వెల్లడిస్తామన్నారు. ఇతర వివరాలకు ఓయూ వెబ్‌సైట్ www.osmania.ac.inలో చూసుకోవచ్చని తెలిపారు.

గ్రేటర్ మహిళా సంఘం అధ్యక్షురాలిగా రజిత

అంబర్‌పేట, జనవరి 11 : అంబర్‌పేట లోని తెలంగాణ ముదిరాజ్ సంఘం కార్యాలయంలో గ్రేటర్ హైదరాబాద్ మహిళా సంఘం అధ్యక్షురాలిగా నాగోల్‌కు చెందిన చిక్కుడు రజితను ఎన్నుకున్నారు. గ్రేటర్ హైదరాబాద్ మహిళా విభాగం ప్రధాన కార్యదర్శిగా నాగోల్‌కు చెందిన చిలుముల సుప్రియను, ప్రచార కార్యదర్శిగా బాకారానికి చెందిన గొడుగు లక్ష్మిని ముదిరాజ్ సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు పుట్టి యాదగిరి ముదిరాజ్ రామముదిరాజ్‌తో కలిసి నియామక పత్రాలు అందించారు. ఈ సందర్భంగా పుట్టి యాదగిరి ముదిరాజ్ మాట్లాడుతూ.. సీఎం రేవంత్‌రెడ్డి చొరవ తీసుకొని ముదిరాజ్‌లను బీసీ-ఏ, జాబితాలోకి చేర్చాలని కోరారు. సంఘం ప్రతినిధులు శ్రావణ్‌ముదిరాజ్, సరసింహా ముదిరాజ్, రాజు ముదిరాజ్ తదితరులు పాల్గొన్నారు.

పీహెచ్‌డీ ప్రవేశ పరీక్ష నోటిఫికేషన్ విడుదల

ఉస్మానియా యూనివర్సిటీ : ఓయూ పరిధిలోని వివిధ ఫ్యాకల్టీలకు సంబంధించిన కేటగిరీ 2 కింద పీహెచ్‌డీ ప్రవేశాలకు ప్రవేశపరీక్ష నోటిఫికేషన్ విడుదల చేసినట్లు డైరెక్టరేట్ ఆఫ్ అడ్మిషన్స్ డైరెక్టర్ ప్రొఫెసర్ ఐ. పాండురంగారెడ్డి తెలిపారు. అర్హత కలిగిన అభ్యర్థులు ఈనెల 24 నుంచి వచ్చే నెల 23 వరకు తమ పేర్లను నమోదు చేసుకుని దరఖాస్తులు దాఖలు చేయాలని సూచించారు. రూ.2000 అపరాధ రుసుముతో మార్చి 5వరకు దరఖాస్తులు స్వీకరిస్తామని చెప్పారు. ఇతర వివరాలకు ఓయూ వెబ్‌సైట్ www.osmania.ac.inలో చూసుకోవాలని సూచించారు.

కల్లు గీత కార్మికుల సమస్యలు పరిష్కరించాలి

చిక్కడపల్లి, జనవరి 11: కల్లుగీత కార్మికుల సమస్యలు పరిష్కరించాలని బాల గౌని బాల్‌రాజ్‌గౌడ్, కల్లుగీత కార్మిక సంఘం అధ్యక్షుడు ఎంవీ రమణ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. కల్లుగీత కార్మిక సంఘం ఆధ్వర్యంలో రూపొందించిన నూతన సంవత్సర క్యాలెండర్‌ను శనివారం వారు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. వృత్తిలో మరణించిన వారి కుటుంబాలకు, వికలాంగులైనవారికి ఇవ్వాల్సిన ఎక్స్ గ్రేషియాను సంవత్సరం నుంచి ఇవ్వడం లేదని, వెంటనే ఇవ్వాలన్నారు. ఎన్నికల సమయంలో కల్లుగీత కార్మికులకు ఇచ్చిన హామీని అమలు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో గౌడ కల్లుగీత వృత్తిదారుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు అయిలి వెంకన్న గౌడ్, విజయ్‌కుమార్‌గౌడ్, సంఘం నాయకులు వెంకట నర్సయ్య, ఐలేన్‌గౌడ్, నరేశ్ పాల్గొన్నారు.

విజయకుమార్‌కు డాక్టరేట్

వ్యవసాయ యూనివర్సిటీ, జనవరి 11 : ఆచార్య జయశంకర్ వ్యవసాయ విశ్వవిద్యాలయం ప్రధాన గ్రంథాలయంలో రీసెర్చ్ అసోసియేట్‌గా పనిచేసిన విజయకుమార్‌కు జేఎన్‌టీయూ పీహెచ్‌డీ అందజేసింది. క్లౌడ్ కంప్యూటింగ్‌లో డిజైన్ ఆఫ్ ట్రస్ట్ మోడ ల్స్ యూసింగ్ సర్వీస్ ప్రొవైడర్ క్లేమ్స్ అండ్ యూజర్ రెస్పాన్స్ ఫర్ క్లౌడ్ ఎన్విరాన్‌మెంట్ అనే అంశంపై చేసిన పరిశోధనకు గాను విజయ్‌కుమార్ పీహెచ్‌డీ లభించింది. ఆదిలాబాద్ జిల్లా బెల్లంపల్లికి చెందిన విజయ్‌కుమార్ ప్రాథమిక విద్యాభ్యాసం సొంతూరులో పూర్తి చేసి హైదరాబాద్‌లో స్థిరపడి ఉన్నత చదువులు కొనసాగించారు.

జాతీయ బీసీ మహాసభ రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా సత్యపాల్‌సింగ్



కాచిగూడ, జనవరి 11: నింబోలి అడ్డా కార్యాలయంలో జాతీయ బీసీ మహాసభ రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా నగరానికి చెందిన సత్యపాల్‌సింగ్‌ను నియమించారు. ఈ సందర్భంగా నియామక పత్రా న్ని జాతీయ బీసీ మహాసభ అధ్యక్షుడు రాజేందర్‌పటేల్‌గౌడ్ శనివారం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన బీసీ కుల వృత్తుల వారికి యంత్రాలు కొనుగోలు చేయడానికి రూ.10 లక్షల నుంచి రూ.50 లక్షల వరకు రాయితీని అందజేయాలని డిమాండ్ చేశారు. పులి జాల కృష్ణ, మెట్టు ముత్యాల్‌రావు, డాక్టర్ ప్రశాంత్ నిమ్కర్, భాస్కర్, ప్రదీప్‌గౌడ్, కిశోర్‌గౌడ్ పాల్గొన్నారు.

సైఫాబాద్ సైన్స్ కళాశాల వైస్ ప్రిన్సిపల్‌గా డాక్టర్ అరవింద్

ఉస్మానియా యూనివర్సిటీ : ఉస్మానియా యూనివర్సిటీ సైఫాబాద్ సైన్స్ కళాశాల వైస్ ప్రిన్సిపాల్‌గా డాక్టర్ అరవింద్ నియమితులయ్యా రు. కెమిస్ట్రీ విభాగానికి చెందిన ఆయనకు ఈ మేరకు నియామక పత్రాన్ని ఓయూ వీసీ ప్రొఫెసర్ కుమార్ అందజేశారు. ఆయనను పలువురు అధికారులు, అధ్యాపకులుఅభినందించారు.

రిజర్వేషన్లను రక్షించుకుందాం..

• ఫిబ్రవరి 2న లక్ష మందితో శాంతియాత్ర

• మాల సంఘాల జేఏసీ చైర్మన్ జి.చెన్నయ్య

నినాదాలు చేస్తున్న మాల సంఘాల జేఏసీ నాయకులు

ఖైరతాబాద్, జనవరి 11: రాజ్యాంగం, రిజర్వేషన్లు రక్షించుకుందామన్న నినాదంతో ఫిబ్రవరి 2న మాల సంఘాల జేఏసీ ఆధ్వర్యంలో నెక్లెస్ రోడ్‌లో లక్ష మందితో శాంతియాత్ర నిర్వహిస్తున్నట్లు జేఏసీ చైర్మన్ జి.చెన్నయ్య తెలిపారు. సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో శనివారం సాయంత్రం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. కేంద్రంలో బీజేపీ అధికారంలోకి వచ్చిన తర్వాత ఆ పార్టీ పాలిత రాష్ట్రాల్లో దళితులపై దాడులు, దౌర్జన్యాలు, హత్యాకాండలు ప్రారంభమయ్యాయన్నారు. గతంలో రిజర్వేషన్లు ఎత్తివేస్తామని, రాజ్యాంగాన్ని మారుస్తామని ప్రకటించిన సందర్భాలు ఉన్నాయన్నారు. పాలకుల దమననీతిని ఎండగట్టేందుకు ఫిబ్రవరి 2న జరిగే శాంతియుత యాత్రకు దళితులు, బీసీ వర్గాలు, విద్యార్థులు, మహిళా సంఘాలు పెద్ద ఎత్తున పాల్గొనాలని పిలుపునిచ్చారు. సమావేశంలో మందాల భాస్కర్, రమేశ్ బాబు, వెంకటేశ్వర్లు, మన్నె శ్రీధర్, కిషన్ పాల్గొన్నారు.

ఐక్యత సభ వాల్‌పోస్టర్ ఆవిష్కరణ